www.netifocusnews.com

నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

# తెలంగాణ జిల్లాలు

సోమవారం 10, మార్చి 2025 | పేజీలు: 04

## 13వ జాతీయస్థాయి తెలుగు ఆహ్వానిత నాటక పోటీలు

తొర్రూరు, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 9: న్యూస్ చైతన్య కళా సమాఖ్య గత 40సంవత్సరాలుగా తొర్రూరులో నాటకోత్సవాలను నిర్వహిస్తూ ఈ సంవత్సరం "13వ జాతీయ స్థాయి తెలుగు ఆహ్వానిత నాటక పోటీలను" ఈరోజు నుండి మార్చే 10, 11, 12, 13, 14 (మిగతా 2లో..)




# కనుమరుగవుతున్న పల్లెటూరి లోగిళ్లు



## మాయమవుతున్న పల్లెటూరి సహజత్వం..

## మసకబారుతున్న మనుషుల మధ్య బంధుత్వం



మహబూబాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి/సైదులు)-మార్చి 9:

**ఎప్పటికీ తరగని ప్రకృతి అందాలు** ఎన్నటికి చెక్కుచెదరని బంధాలు.. ఆప్యాయతాను రాగాలు పల్లెల సొంతం, ఎన్నేళ్ళు గడిచినా పల్లెతో మన కున్న బంధం చెదిరిపోనిది, పక్కింటి వాళ్ళ మాటలు, పొరుగింటి వారి పలకరింపులు, ఆప్యాయతలు, బంధాలు, బంధుత్వాలు పల్లెల్లో కాక ఇంకెక్కడ ఉంటాయి.. ఏవైనా పండుగలు పబ్బాలు వచ్చినా బంధువులతో కలిసి ఉండడం పల్లెల సంప్రదాయం. పట్టణాలతో పోల్చితే చాలా వ్యత్యాసం ఉంటుంది. పట్టణాల్లో జీవించే వారి జీవన విధానంలో చాలా మార్పులు చోటు చేసుకుంటాయి, అగ్గి పెట్టెలాంటి ఇల్లులు, గజిబిజి జీవితాలు, ఎవరితోనూ కలుపుగోలుగా ఉండక పోవడం, ఎవరి పని వారికి అన్నట్లుగా సాగుతుంది. పట్టణాల్లో ఎప్పుడూ కూడా ఒత్తిడి, భయంతో వారి జీవన విధానం ఉంటుంది, మాట్లాడుకోవడానికి కనీసం ఒకరైనా ఉండని స్థితి, ఆప్యాయతలు, పలకరింపులు కూడా కనబడవు. అదే పల్లెల విషయానికొస్తే ఉదయం లేచిన దగ్గర నుంచి సాయంత్రం పొద్దు పోయేవరకు కూడా పొరుగు వారితోనే కాలం గడిచిపోతుంది, పల్లె ముచ్చట్లు మురిపిస్తాయి. అలాగే మైమరపిస్తాయి కూడా, తెల్లారని నుంచి మనుషుల పలకరింపులు, ప్రకృతి గుబాళింపులతో పల్లె వాతావరణం వుంటుంది. ఏదైనా విషయం గురించి చర్చించడానికి రచ్చబండలు చుట్టూ ఎత్తయిన కొండలు, వాగులు, వంకలు, చుట్టూ అలుముకున్న పచ్చనివృక్షాలు, వాటికి ఉన్న పిచ్చుకగూళ్ళు ఎంత అనుకున్నా తక్కువే, పట్టణాలు అన్ని పల్లెల నుంచి పుట్టుకొచ్చినవే అనే నానుడి కూడా ఉంది. ఎప్పటికీ కనుమరుగు కాని అందం పల్లెల సొంతం, ఈ పల్లెల్లో నివసించే వారి ఆయుష్షు కూడా పెరుగుతుందని భావిస్తారు. అయితే మనం ఆలోచించాల్సిన విషయం ఒకటుంది అదేంటంటే రాను రాను పల్లెలు వాటి సహజత్వాన్ని కోల్పోతున్నాయి దానికి కారణం మనుషల ఆలోచనా విధానాలు, పెరుతున్న సాంకేతికత, పారిశ్రామికరణ, పర్యావరణ కాలుష్యము, అవసరాలు, నిరుద్యోగం ఇలా చాలా ఉన్నాయి. కానీ వాటి పర్యావసానాలు చాలా ప్రమాదకరంగా మారి పల్లె వాతావరణాన్ని మనుషుల మధ్య బంధాలను దెబ్బతిస్తున్నాయి.

పల్లెటూళ్ళు భారతదేశానికి గుండెకాయ లాంటివి, పల్లెటూళ్ళలోనే అచ్చమైన, స్వచ్ఛమైన భారతీయ సంస్కృతి ప్రతి బింబిస్తుంది. మనిషి ఎంత అభివృద్ధిని సాధించినా బాల్యంలోని (మిగతా 2లో..)

# మదనపురంలో కనీస సౌకర్యాలు కల్పించండి

- నాడు రెండవ బొంబాయిగా ప్రసిద్ధి..
- నేడు కనీస సౌకర్యాలకు నోచుకోని దుస్థితి..
- బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్





వనపర్తి ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్):

**మదనాపూర్ మండల ప్రజలకు కనీస** సౌకర్యాలు కల్పించాలని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాచాల చేపట్టిన మార్నింగ్ వాక్ కార్యక్రమం ఆదివారం మదనాపూర్ మండల కేంద్రంలో ప్రారంభమైంది. అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్థానిక ప్రజలతో కలిసి సంతసాగే స్థలాన్ని, రైల్వే స్టేషన్, ఊకచెట్టు వాగు, మార్కెట్ యార్డు తదితర ప్రాంతాలను పరిశీలిస్తూ మార్నింగ్ వాక్ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్థానిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలనే ఏకైక లక్ష్యంతో మార్నింగ్ వాక్ కార్యక్రమం చేపట్టామన్నారు. పూర్వం రెండవ బొంబాయిగా ప్రసిద్ధి గాంచిన మదనాపూర్ నేడు కనీస సౌకర్యాలకు కూడా నోచుకోకపోవడం బాధాకరమని అవేదన వ్యక్తం చేశారు. మండలంలో జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు వేరే ప్రాంతానికి వెళ్లి చదువుకోవటానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఊకచెట్టు వాగుపై బ్రిడ్జి నిర్మాణం వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, లేనిపక్షంలో వచ్చే వర్షాకాలం ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగే అవకాశం ఉందన్నారు. ఇక్కడి రైల్వే స్టేషన్లో చాలవరకు ఎక్స్ ప్రెస్ రైళ్లు ఆగడం లేదని, ఈవిషయమై ఎన్నో సార్లు (మిగతా 2లో..)

# కనుమరుగవుతున్న పల్లెటూరి లోగిళ్లు

(మొదటిపేజీ తరువాయి..)

గుర్తులన్నీ అతని మనసులో పదిలంగా ఉంటాయి. అందుకే కేరింతలతో భూమిమీద పడినప్పుడే పుట్టి పెరిగిన ఊరితో అతనికి సంబంధం ఏర్పడుతుంది. కొనవూపిరి పోయేవరకు ఊరితో ఆ అనుబంధం కొనసాగుతూనే వుంటుంది. అమ్మఒడి, చదువుకున్న బడి, ఊరిలోని గుడి అన్నీ అతని జీవితంలో కలకాలం మంచి మధుర స్మృతులుగా మిగిలిపోతాయి. అవకాశాలు లేక అవసరాల కోసం మనిషి ఎంత దూరం వెళ్ళినా మనసెప్పుడూ అమ్మవైపు, ఊరివైపు లాగుతూనే ఉంటుంది. స్వచ్ఛమైన ఊరిగాలి పీల్చాలని, కమ్మనైన అమ్మ ప్రేమ పొందాలనీ, బాల్యమిత్రులను కలుసుకోవాలని మనసుపడే ఆరాటాన్ని చెప్పడానికి మాటలు చాలవు, బతుకు తెరువు కోసం, విద్యార్జన కోసం వున్న ఊరు వదిలి ఎంతో మంది పట్టణాలకు వలసవచ్చి స్థిరపడ్డారు. వివిధ సందర్భాలలో పట్టణ పరిస్థితుల్లో ఇమడలేక ఉన్న ఊరుకు తిరిగి వెళ్లలేక నలిగిపోతుంటారు. కన్నతల్లి లాంటి ఉన్న ఊరు జ్ఞాపకాలను మర్చిపోలేక మళ్ళీ ఆ అనుభూతులను, అనుబంధాలను తిరిగిపొందాలని తపించిపోతుండటం సహజం. ఒకప్పుడు పచ్చదనానికి ప్రకృతికి నిలయాలుగా ఆత్మీయానుబంధాలకు ప్రతీకలుగా ఉన్న పల్లెటూళ్ళు రాను రాను వాటి సహజత్వాన్ని కోల్పోతున్నాయి.

**వ్యవసాయం:** వ్యవసాయం పల్లెల ప్రధానవృత్తి. రైతు దేశానికి వెన్నెముక. ఏడాది పొడవునా ఏదో ఒక రకమైన వ్యవసాయ పనులతో తీరికలేకుండా ఉంటారు. ఎద్దులకు కట్టిన చిరుగంటలు గణగణ మోగు తుండగా బళ్ళను తోలుకుంటూ పొద్దు పొడవకముందే పొలాలకు వెళ్లే వ్యవసాయదారులు మన పల్లెలకు నిజమైన అలంకారాలు. అందుకే మట్టిని నమ్ముకున్న ప్రతీ వ్యవసాయదారుడి బ్రతుకు మట్టితోనే ముడిపడి ఉంటుంది. వ్యవసాయం రైతుకు ఊపిరి, రోజంతా వ్యవసాయం చేస్తూ గడపడంలోనే రైతులు తమ ఆనందాన్ని వెతుక్కుంటారు. ఎత్తుపల్లాల భూమిని చదును చేసి సోమరితనం లేకుండా సాగుచేయడం అంతే భూమితో కష్టం సుఖం చెప్పుకున్నట్లుంటుంది అనడం రైతుకూ భూమికీ ఉన్న అవినాభావ సంబంధాన్ని తెలియజేస్తుంది. తరతరాలుగా అన్నిబంధాలూ, అనుబంధాలూ రైతులకు మట్టితోనే. కాబట్టే వ్యవసాయం పల్లెల రైతులకు ప్రధానమైన వృత్తి మాత్రమే కాకుండా వాళ్ళ జీవనంలో అంతర్భాగంగా కలిసిపోయింది.

**బాల్య స్మృతులు:** ఊరినీ, ఊరిలోనీ పరిసరాలనూ, కలిసి తిరిగిన వ్యక్తులనూ, స్నేహితులను, సన్నిహితులను, గుడినీ, బడినీ ఇలా ఊరిలోని అణువణువుతో వున్న అనుబంధాన్ని, అవి మిగిల్చిన అనుభూతుల్ని ఏ ఒక్కరూ మర్చిపోలేరు. 'ఊరంటే అమ్మచెంగుతో, ముఖం తుడుచుకున్నంత ఊరట' 'ఊరంటే అమ్మ చేతి గోరు ముద్దు'. ఊరంటే నాన్నచేయి పట్టుకుని అందరివైపు ధీమాగా చూస్తూ ముందుకు నడిచిపోవడం కడిగిన ముత్యంలా, కల్పవృక్షంలా మన అవసరాలన్నీ తీరుస్తూ ముందుకు నడిపించే ఊరి అనుబంధాలకు అపురూపమైన కానుక అమ్మ. అమ్మచెంగు, నాన్న చెయ్యి అన్నీ వ్యక్తి ఎంత ఎదిగినా ముందుకు నడిపిస్తూనే ఉంటాయి. అమాయకత్వం కలబోసిన కొంటెతనం వ్యక్తిత్వానికి బాటలు వేస్తుంది. పల్లెప్రజల జీవితం ప్రకృతితో ఎంతగా ముడివేసుకుని ఉంటుందో, సెలయేళ్లు, పిల్లగాలులు, వెన్నెల, ఊరికే కొత్త శోభను చేకూర్చే కోయిల పాట, ఆకు చాటు పువ్వు ఇవన్నీ కలిసి ఊరి ప్రకృతి శోభను మరింత ఇనుమడింపజేస్తున్నాయి. పల్లెప్రజల ఆలోచనలు, ఊహలు అన్నీ ప్రకృతితో ముడిపడి వుంటాయి. వ్యక్తి జీవితంలో బ్యాల్యం ఒక మధురస్మృతి. వ్యక్తిగా ఎంత ఎదిగినా బాల్యస్మృతులు విడిచిపెట్టవు. చిన్ననాటి ఆటలు, పాటలు, గోరుముద్దల్లా కనిపించే అమ్మ అనురాగం, చిన్నతనంలో చెయ్యి పట్టుకుని నడిపించే నాన్న నిగ్రహం కళ్ళముందు కదులుతాయి. అమ్మ తినిపించే గోరుముద్దలు, ఆకాశంలో చందమామ మామిడితోటలో ఈతకొట్టే బావులు. ఆకాశం ఉరిమినా, మెరుపులు మెరిసినా బాల్యం ఆనందంతో కేరింతలు కొడుతుంది. ఎండాకాలంలో ఆకల్ని కూడా మర్చిపోయి మామిడి తోటల్లో తిరిగిన బాల్యం మధురానుభూతికి లోనుచేస్తుంది. బాల్యంలోని చిలిపితనానికి చిన్నతనంలో చేసే అల్లరులకి హద్దులుండవు. వాన వస్తుంటే బడి ఎగ్గొట్టి కాగితాలతో పడవలు చేసి అవి ఆ నీటిలో తేలుతుంటే చిన్నపిల్లల ఆనందానికి అంతే ఉండదు. బడికి సెలవు వస్తే వారికి పండుగ వచ్చినంత సంతోషం. గడ్డివాములు ఎక్కుతూ దిగుతూ అలుపు వచ్చినపుడు సినిమా కబుర్లు చెప్పుకుంటూ గడిపే ఆ రోజులు ప్రతీ వ్యక్తి జీవితంలో తిరిగిరాని జ్ఞాపకాలుగా నిల్చిపోతాయి.

**సహజీవనం-ఆప్యాయతలు:** పల్లెటూళ్ళు సహజీవనానికి అనురాగ ఆప్యాయతలకు చిహ్నాలు. సంప్రదాయంతో పాటు సంస్కృతిని కూడా పల్లెజీవనం అలవాటు చేస్తుంది. ఒకతరం నుండి ఇంకొక తరానికి సామాజిక వారసత్వాన్ని అందించడంలో పల్లెటూళ్ళు పోషించే పాత్ర మరువలేనిది. అందుకే పల్లెటూరి మనుషుల మధ్య బంధాలు ఈర్ష్యాద్వేషాలకతీతంగా అన్యాయాక్రమాలకు దూరంగా అన్యోన్యతను పెనవేసుకుని ఉండేది. సహజీవనం అనేది పల్లెల్లో కనిపించే ముఖ్యాంశం. ఈర్ష్యలు, ద్వేషాలు, అన్యాయాలు, అక్రమాలన్నింటికీ దూరంగా కలిసివుంటే కలదు సుఖం అనేదానికి ప్రతిబింబంగా పల్లెటూళ్ళు అలరారుతుండేవి. సాదాసీదాగా కనిపించే పల్లెలు సహజ సౌందర్యంతో ప్రకాశిస్తాయి. ఇతరుల కష్టాలలో సుఖాలలో పాలుపంచుకోవడం పల్లెజనుల ప్రత్యేకత. కొత్తాపాతా, చిన్నాపెద్దా అనే తేడాలేకుండా కలుపుగోలుతనంగా ఉండడం పల్లెప్రజల స్వచ్ఛమైన నైజం. ఎంత తెలియని మనిషి ఊళ్ళోకి వచ్చిన తాగడానికి నీళ్ళిచ్చి కుశలమడిగే ఆనాటి సంబంధాలన్నీ మనిషి చెట్టుకు అల్లుకున్న మమకార తీగలుగా వుండేది. అచ్చమైన పల్లెలు స్వచ్ఛమైన మనుషులు, మమతాను రాగాలకు ప్రతీకలుగా వుండేవి.

**ఆటపాటలు:** చిన్నతనంలో పల్లెటూళ్లలో మనకు కనిపించే దృశ్యం, తరతరాల నుండి వారసత్వంగా వస్తున్న సంపద ఆటలు. ఆటలు శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తాయి. ఈ ఆటలు కూడా పండుగల వలె సంస్కృతీ సంప్రదాయాలను ఆచారవ్యవహారాలను ప్రతిబింబిస్తాయి. భారతదేశం ఆటపాటలకు పుట్టినిల్లు. పల్లెల్లో పెరిగే పిల్లలు నిత్యం ప్రకృతితో ఆడుకుంటూనే ఉంటారు. చెట్టూ పుట్టా గట్టూ కాలువా అన్నీ వాళ్ళ ఆటలకు స్థలాలే. తీరొక్కా ఆటపాటలా మధ్య తీర్చిదిద్దితివి నన్ను అని చెప్పడం పల్లెటూళ్లలో పిల్లలు ఆటలకు ఎంత సన్నిహితంగా ఉన్నారో, ఉగ్గుపాలతోనే ఇటువంటి వాటిపట్ల ఎంత మక్కువ కలిగి ఉంటారో, బాల్యాన్ని భవిష్యత్తులో కూడా మనముందుంచేవి ఆటలు. ఎండా, వానా, వెన్నెల ఏవైనా చిన్నపిల్లలకు సమానమే. ఎండను సైతం లెక్కచేయకుండా పొలాలలో బిళ్లంగోడు ఆడడం, చెడుగుడు, చిర్రగొనే, గోళీలాటలు మొదలగునవన్నీ వారికి ఉత్సాహంతో పాటు చురుకుదనాన్ని, తెలివితేటలను కూడా ఇస్తాయని చెప్పడం అతిశయోక్తి కాదు.



**పండుగలు-జాతరలు:** ఆటపాటల తర్వాత పల్లెల్లో కనిపించే మరొక ముఖ్య విషయం పండుగలు. దీనిలోనే జాతరలు కూడా ఆయా సందర్భాలను బట్టి నిర్వహిస్తుంటారు. భారతదేశంలో హిందూమతం తరతరాలుగా ఉన్న మతం. అన్ని మతాల్లో పండుగలు ఉన్నా ఇతరులకంటే హిందువులకే ఎక్కువ పండుగలున్నట్లు తెలుస్తుంది. కాబట్టే పండుగలు, ఉత్సవాలు, జాతరలు మొదలగు వాటిని పల్లెల్లో నెలకొన్న ఆహ్లాదకర, సామరస్య వాతావరణానికి నిదర్శనంగా చెప్పవచ్చు. కుల మతాలకు అతీతంగా వేడుకలను, పండుగలను జాతరులను, గ్రామ దేవతా జాతరలను ఏకమత్యంగా జరుపోవడం పల్లెల్లో చాలా ప్రత్యేకం. ప్రతీ ఊరి చివరలో చెట్టు కింద గట్టుకింద చెరువుగట్టు మీదా గుళ్ళు మనకు కనిపిస్తుంటాయి. నాలుగు బండరాళ్లను ఏర్పాటుచేసి అందులో గ్రామదేవతలను ఉంచి పూజించడం పల్లెటూళ్ళల్లో కనిపించే ఇంకొక అంశం. తమ గ్రామాలను నిత్యం కొంతమంది దేవతలు కాపాడుతుంటారని, అపాయమూ, రోగమూ రాకుండా రక్షిస్తుంటారని వారి నమ్మకం. అందుకనే పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ, ముత్యాలమ్మ, నూకాలమ్మ, పెద్దమ్మ మొదలగు దేవతలకి చిన్నచిన్న గుళ్ళు ఏర్పాటు చేసి నిత్యం పూజలు చేస్తుంటారు. పల్లెటూళ్ళు స్వచ్ఛతకి, అమాయకత్వానికి, అనుబంధానికి ప్రతీకలుగా భావించవచ్చు. అంతేగాక పచ్చని ప్రకృతికి నిలయంగా ఉండడంతో పాటు మంచినీరు, మంచి ఆహారం వంటి సదుపాయాలకు కూడా పల్లెటూళ్ళు నిలయాలుగా ఉంటున్నాయి. పల్లె తల్లిలాంటిది. తెలుగుదనానికి మూర్తీభవించిన ప్రతిరూపం. చిన్నప్పటి ఆప్యాయతలు, అనుబంధాలు, సహజ ప్రకృతి దృశ్యాలు, స్నేహాలు.. మారుతున్న కాలంతో పాటు ఆధునీకరణ, సంకేతికత, పారిశ్రామికరణ వంటి వాటి వల్ల పల్లెల్లో సహజ వనరుల క్షీణత, అలాగే కుటుంబ బంధాల విషయంలో డబ్బు పాత్ర అధికం అవుతున్నప్పటి నుంచి మనుషుల మధ్య స్వార్ధం పెరిగి ఈర్ష్య, అసూయ, ద్వేషం ఆవహించి విలువలని మరిచి మనిషి జీవనం సాగిస్తున్నాడు.

**పల్లెటూరి సహజ ప్రకృతి వనరుల కనుమరుగు:** ఒకప్పుడు పల్లెలు ప్రకృతి మాధుర్యంతో నిండి ఉండేవి. పొలాలు, గోదావరి, కృష్ణా వంటి నదులు, చెరువులు, కాల్వలు, పచ్చని కొండలు, వెన్నెల రాత్రుల్లో తడిమే గాలులుఇవి అన్నీ పల్లెటూరి ప్రత్యేకతలు. కానీ మారుతున్న పరిస్థితులు, పెరుగుతున్న జనాభాతో పాటు పారిశ్రామికరణ వంటివి రావడంతో పల్లెల్లో సహజ వనరులు తగ్గిపోతున్నాయి.

**వ్యవసాయ మార్పులు:** సంప్రదాయ, పాత వ్యవసాయ విధాన స్థానంలో రసాయన ఎరువులు, పురుగుమందులతో నిండిన కొత్త వ్యవసాయ విధానాలు వచ్చాయి. పెట్రోలు ఇంజన్ల వల్ల వ్యవసాయ పనులు సులభమయ్యాయి కానీ మట్టి నాణ్యత తగ్గిపోయింది. అంతేకాదు, గణనీయంగా చెట్లు నరికివేయడం, వ్యవసాయ భూములను ఇంటి స్థలాలుగా మార్చడం వల్ల ప్రకృతి అందాలు హరించక పోతున్నాయి.

**నీటి వనరుల క్షీణత:** ఒకప్పుడు గ్రామాల్లో చెరువులు, కుంటలు నీటితో నిండేవి. ఇవి వర్షపు నీటిని నిల్వ చేసేందుకు, భూగర్భజలాలను సమృద్ధిగా ఉంచేందుకు సహాయపడేవి. కానీ ఆధునిక నిర్మాణాల కారణంగా వీటి సంఖ్య తగ్గిపోయింది. బోర్లు పెరగడం, చెరువులను భూసేకరణతో నాశనం చేయడం వల్ల గ్రామాల్లో నీటి కొరత పెరిగింది.

**వాతావరణ మార్పులు:** సహజంగా పల్లెల్లో ఉండే వెచ్చని అనుబంధాన్ని, ప్రకృతి అందాన్ని పరిశ్రమల ధూళి, పెరిగిన ఉష్ణోగ్రతలు దెబ్బతీస్తున్నాయి. అడవులు నరికివేయడం వల్ల వర్షపాతం తగ్గి, మూడు, నాలుగు దశాబ్దాల క్రితం ఉన్న పచ్చదనం ఇప్పుడు కనుమరుగైపోతోంది.

**మానవ సంబంధాల మార్పులు:** ప్రకృతి అందాల మార్పుతో పాటు మనుషుల మధ్య ఉన్న అనుబంధాలు కూడా మారిపోయాయి.

**మౌలిక జీవనశైలి మార్పులు:** అంతకుముందు పల్లెటూరి జీవితం అనేది ఒక కుటుంబంలా ఉండేది. ప్రతి ఇంటి మధ్య అనుబంధం గట్టిగా ఉండేది. ఏదైనా మంచి, చెడు జరిగినప్పుడు అందరూ కలిసి ఉండేవారు. కానీ ఆధునికత, సాంకేతికత,నగరీకరణ పెరిగే కొద్దీ ఈ అనుబంధాలు తగ్గిపోతున్నాయి.

**వలసలు, ఉపాధి మార్పులు:** పట్టణాలలో ఉపాధి అవకాశాలు పెరగడంతో గ్రామీణ ప్రజలు పెద్దఎత్తున వలస వెళ్తున్నారు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థలు నడిచేవి. కానీ ఇప్పుడు ప్రతి ఒక్కరూ స్వతంత్ర జీవనాన్ని కోరుకుంటున్నారు. దాంతో కుటుంబ అనుబంధాలు చీలిపోతున్నాయి. పండుగలు, ఉత్సవాల్లోనూ కలిసే సాంప్రదాయం కూడా తగ్గిపోతోంది.

**సాంకేతికత ప్రభావం:** నేటి కాలంలో సోషల్ మీడియా, టెలివిజన్, స్మార్ట్‌ఫోన్లు ప్రజల మధ్య సంభాషణను తగ్గించాయి. ఒకే ఇంట్లో ఉండే వారు కూడా వ్యక్తిగత జీవన విధానాన్ని మించిన సంబంధాలను కొనసాగించలేకపోతున్నారు. ఈ పరిణామం గ్రామీణ జీవనశైలికి కొత్త సవాళ్లను తెస్తోంది. ఈ సమస్యలను ఎదుర్కోవడానికి కొన్ని మార్గాలను అవలంబించాలి.

✓**పర్యావరణ పరిరక్షణ: చెట్లను నరికే బదులుగా కొత్తగా నాటాలి, చెరువులను కాపాడాలి.**

✓**పారిశ్రామిక కాలుష్యం తగ్గింపు: గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించాలి.**

✓**సంబంధాలను పునరుద్ధరించుకోవడం: ఉత్సవాలు, పండుగలు, కుటుంబ సమావేశాల ద్వారా బంధాలను బలపరచుకోవాలి.**

✓**గ్రామీణ అభివృద్ధి: యువత గ్రామాల్లోనే ఉపాధి పొందేందుకు మంచి అవకాశాలను అందించాలి.**

గ్రామాల్లో ప్రజలు ప్రకృతిని పూజిస్తారు మనుషులను ప్రేమిస్తారు కానీ మారుతున్న కాలానికి కొనసాగింపుగా గ్రామాల్లో సహజ వనరులు కలుషితమై అంతరించిపోవడం , అలాగే మనుషుల మధ్య స్వార్థం పెరిగి అనుబంధాలు తగ్గిపోవడం, అవసరాల కోసం మాత్రమే మనిషి జీవించడం వలన నేటి ప్రపంచం కలుషిత వలయంలో సాగుతుంది. పల్లెటూరి అందాలు కనుమరుగైపోతున్నాయి అంటే మన సంస్కృతిలో మార్పులు వస్తున్నాయని అర్థం. కానీ మన పూర్వీకుల జీవన విధానంలో ఉన్న మంచి విలువలను, ప్రకృతి పరిరక్షణ విధానాలను మనం కొనసాగించాలి. ఆధునికతను స్వీకరించాలి కానీ పాత సంప్రదాయాలను పూర్తిగా విస్మరించకూడదు. మన భవిష్యత్ తరాలకు పచ్చని పల్లెలను అందించగలిగి, మానవ సంబంధాలను మరింత బలపరచగలిగితే, అదే నిజమైన అభివృద్ధి అవుతుంది.

## 13వ జాతీయస్థాయి తెలుగు ఆహ్వానిత నాటక పోటీలు

(మొదటిపేజీ తరువాయి..)

2025 తేదీలలో 5 రోజులపాటు నిర్వహిస్తున్నామని, రంగస్థలం మరుగున పడిపోతున్నటువంటి ఈ కాలంలో చైతన్య కళా సమాఖ్య ఈ నాటుకోత్సవాలని తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ, చలనచిత్ర, టీవీ, రంగస్థలం అభివృద్ధి సంస్థ మరియు తొర్రూరు వ్యాపార,వాణిజ్య రంగాల సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండి కళాకారులు, కళా సంస్థలు మంచి ఇతి వృత్తమైన నాటక ప్రదర్శనలు ఇవ్వడానికి విచ్చేస్తున్నారని సంస్థ అధ్యక్ష కార్యదర్శులు మన్నూరు ఉమా, సుంకరనేని పినాకపాణి, సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు అసోసియేటర్ ప్రెసిడెంట్ లు జినగ సురేందర్ రెడ్డి, మంగళపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి తొర్రూర్ మరియు పరిసర గ్రామ ప్రాంతాల్లో ఉన్నటువంటి ప్రేక్షకులు, కళాభిమానులు అందరూ పాల్గొని నాటకోత్సవాలను జయప్రదం చేయవలసిందిగా సంయుక్త ప్రకటనలో కోరారు.

## మదనాపురంలో కనీస సౌకర్యాలు కల్పించండి

(మొదటిపేజీ తరువాయి..)

రైల్వే అధికారులకు ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఏ ప్రయోజనం లేకుండా పోయిందని, ఈవిషయంపై స్థానిక ఎంపీ దృష్టి సారించి కేంద్ర ప్రభుత్వం, రైల్వే బోర్డు అధికారులతో మాట్లాడి అన్ని రైళ్లు ఆగేలా కృషి చేయాలన్నారు. మండల కేంద్రంలో ప్రత్యేకంగా సంతకు స్థలం కేటాయించకపోవడంతో రోడ్డుమీదనే అమ్మకాలు సాగిస్తున్నారని, దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు అవుతున్నాయని, సంత జరిగే సోమవారం రోజు బస్సులు లోపలికి వచ్చే అవకాశం లేకవడంతో బయట నుంచే వెళుతున్నాయని, దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంతకు ప్రత్యేక స్థలం కేటాయించాలని కోరారు.మండల కేంద్రంలో బస్టాండు లేకపోవడంతో ప్రజలు ఎండకు, వర్షానికి రోడ్డుమీద నిలబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఉందని, ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండు నిర్మించాలని, అప్పటివరకు కనీసం బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో కొత్త మండలాలు ఏర్పాటు చేసిన గత ప్రభుత్వం వాటికి స్వంత భవనాలు నిర్మించకుండా విస్మరించిందని, ప్రజా ప్రభుత్వంలో నైనా వీలైనంత త్వరగా వాటికి స్వంత భవనాలు నిర్మించాలని కోరారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయాలని, మార్కెట్ యార్డు స్థలం చాలా వరకు కబ్జాకు గురైందని, సరిహద్దుకు వెంటనే కంచె ఏర్పాటు చేసి కబ్జా కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఏనుకుంట రిజర్వాయర్ కింద చివరి ఆయకట్టు రైతులకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, కాలువ మరమ్మతులు చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి జిల్లా అధ్యక్షులు వనం తిరుపతయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, మండల అధ్యక్షులు మహేందర్ నాయుడు, కన్వీనర్ నరసింహ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు కొన్నూరు గూడూషా, మహిళా విభాగం జిల్లా కన్వీనర్ స్వప్న యాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్ రజక, నారాయణ పేట జిల్లా అధ్యక్షులు చిట్యాల లక్ష్మణ్, వనపర్తి పట్టణ అధ్యక్షులు దేవర శివ, పెద్దమందడి మండల అధ్యక్షులు రమేష్ సాగర్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షులు నాగరాజు యాదవ్, ఆత్మకూరు మండల ప్రధాన కార్యదర్శి అక్కల మల్లేష్ గౌడ్, అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షులు తెలుగు నాగరాజు,పెబ్బేరు గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మ్యాదరి రాజు, చెలిమిల్ల రామన్ గౌడ్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పంచముఖి హనుమాన్ దేవాలయ ప్రథమ వార్షికోత్సవానికి పులిమామిడి రాజును ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు



ఫోకస్ న్యూస్ ( సదాశివపేట్) మార్చి 9

సదాశివపేట పట్టణంలోని శ్రీ కృష్ణ నగర్ కాలనీలో స్థాపించిన శ్రీ పంచముఖి హనుమాన్ దేవాలయ ప్రథమ వార్షికోత్సవ మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన కరపత్రికను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజుకు అందించి ఆహ్వానించడం జరిగింది. ఇట్టి కార్యక్రమాలు తేది: 17-03-2025 సోమవారం నుండి మొదలుకొని తేది:19-03-2025 బుధవారం వరకు మూడు రోజులపాటు కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలియపరచారు. కార్యక్రమ వివరాలు 17వ తేది సోమవారం రోజున ధ్వజారోహణము, గోపూజ, విగ్నేశ్వరపూజ, పుణ్యాహ వాచనము, అగ్ని ప్రతిష్ట, హెూమము నిర్వహించబడును. 18 వ తేది మంగళవారం రోజున స్వామివారికి నాగవల్లి, తమలపాకుల అర్చన, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణము, మంగళ హారతి నిర్వహించబడును. 19వ తేది బుధవారము రోజున 108 కలశాలతో స్వామివారికి అభిషేకము, ఆవాహిత దేవతా హెూమము, బలిదానము, పూర్ణాహుతి నిర్వహించబడును. ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించబడును. కావున భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఆ భగవంతుని కృపకు పాత్రులు కాగలరని పులిమామిడి రాజుపిలుపునిచ్చారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుండు రవి, భాజాపా నాయకులు నెమలికొండ వేణుమాధవ్, బామిని రవి, సగ్గం రాములు, కళ్యాణ్ రాజ్, రాగం అనిల్ మరియు పి. ఎం. ఆర్. యువసేన నాయకులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ప్రభుత్వం లక్ష్యం

**- మంత్రి జూపల్లి కృష్ణారావు**

**- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**

అచ్చంపేట నియోజకవర్గ నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఆర్ భరత్ మార్చి 9



నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రజా భవన్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో విలేకర్ల సమావేశంలో అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడిన పర్యాటక శాఖ మరియు ఎక్స్చేంజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విద్యాభివృద్ధి కోసం తెలంగాణ ప్రజా ప్రభుత్వం పని చేస్తుంది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం కు ప్రతి నియోజకవర్గానికి 200 కోట్లు మంజూరు చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం కొరకై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నిర్మించే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల కొరకై 200 కోట్ల మంజూరు చేయడం జరిగింది... యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్యను అన్ని రకాల వసతులు సదుపాయాలతో ఈ యొక్క పాఠశాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. అచ్చంపేట నియోజకవర్గంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు 200 కోట్ల రూపాయల మంజూరు కావడం జరిగింది వెంటనే పనులు ప్రారంభిస్తాం అన్నారు. అదేవిధంగా అన్ని వర్గాల్లో ఉన్న నీరు పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడం లక్ష్యం గాని ఈ ప్రభుత్వం పనిచేస్తుందని తెలియజేశారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో చెప్పిన హామీలన్నీ నెరవేస్తున్నామని మరియు తెలంగాణలో వ్యవసాయ రంగానికి తోడ్పాటును ఇవ్వడం జరుగుతుందని అదేవిధంగా రెండు లక్షల లోపు రుణాలు తీసుకున్నా రైతులందరికీ రుణమాఫీ చేశామని మరియు వ్యవసాయంలో ఉన్న ప్రతి సెంటు భూమికి రైతు భరోసా ఇస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి మల్లేష్ మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ ,పాల్గొన్నారు.



# నల్ల పోచమ్మ ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

నేటి ఫోకస్ న్యూస్ (కౌడిపల్లి )మార్చి 9

కౌడిపల్లి మండల కేంద్రంలోని తునికి గ్రామ శివారులో వెలిసిన నల్ల పోచమ్మ తల్లి, అమ్మవారి పైన భక్తులకు ఉన్నటువంటి నమ్మకం వారి కోరుకున్న కోరికలు నెరవేర్చడం కోసం అమ్మవారికి భక్తులు మేకపోతులు , పుంజులు , కొబ్బరికాయలతో వారి మొక్కులు తీర్చుకుంటూ శివశతులతో నృత్యాలు చేస్తూ అమ్మవారికి సమర్పించడం జరిగింది, అమ్మవారి దగ్గరకు వచ్చినటువంటి భక్తులకు ఎలాంటి అవంతరాలకు పాల్పడకుండా తాగునీటి సమస్యలు లాంటివి తలెత్తరకుండా భక్తులకు సహకరిస్తున్నటువంటి ఆలయ ఈవో రంగారావు ,వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎల్బీసీ సొరంగంలో ఇంజనీర్ గురుప్రీత్ సింగ్ మృతదేహం లభ్యం

అచ్చంపేట నియోజకవర్గం నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఆర్ భరత్ మార్చి 9



ఎస్ఎల్బీసీ ఘటనలో 16 రోజులుగా జరుగుతున్న సహాయక చర్యల్లో పురోగతి కనిపించింది. టన్నెల్‌లో ఒక డెడ్‌బాడీని రెస్క్యూ టీమ్ బయటకు తీసింది. ఘటన జరిగిన 16 రోజుల తర్వాత ఒక మృతదేహాన్ని గుర్తించారు. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట గ్రామ సమీపంలోని శ్రీశైలం లెఫ్ట్ బ్యాక్ కెనాల్ సొరంగంలో ఫిబ్రవరి 22న జరిగిన ప్రమాదంలో 8 మంది చిక్కుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే నిర్జీవంగా ఉన్నవారి కోసం 11 రెస్క్యూ బృందాల ఆపరేషన్ నిరంతరాయంగా 16 రోజులుగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రానికి రాబిన్స్ కంపెనీకి చెందిన ఇంజనీర్ గురుప్రీత్ సింగ్ మృతదేహాన్ని టీబీటీ మిషన్ సమీపంలో మట్టిలో ఇరుకపోయినట్లు కేరళకు చెందిన క్యాడ్వర్ డాగ్స్ గుర్తించాయి. దీంతో ఆ దిశగా ఆదివారం ఉదయం నుంచి రెస్క్యూ బృందాలు తవ్వకాలు చేపట్టడంతో చివరికి మృతదేహాన్ని సొరంగం నుండి వెలికి తీశారు. మృతుడి చేతికున్న కడియం ఆధారంగా రాబిన్ కంపెనీ ఇంజనీర్స్ గురుప్రీత్ సింగ్ గా అధికారులు నిర్ధారించారు. ఆ మృతదేహాన్ని పార్థీవ దేహం వాహనంలో నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం అధికారులు తరలించారు. ఈ రాత్రికి మరికొన్ని మృతదేహాలను రెస్క్యూ బృందాలు వెలికి తీసే అవకాశం ఉంది.



# 136 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**ఎస్సై క్రాంతి కిరణ్**

పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి సైదులు మార్చి 9

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుపడిన సంఘటన మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలో తెల్లవారు జామున పెంట్రోలింగ్ నిర్వహిస్తుండగా హైదరాబాద్కు రేషన్ బియ్యం తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు మాటు వేసి డీసీఎం వాహనంలో తరలిస్తున్న 120 క్వింటాల రేషన్ బియ్యం పట్టుకున్నారు. వాహనంతో పాటు నల్లగొండ జిల్లా గుండ్లపల్లి మండలం రుద్రాయగూడెం గ్రామానికి చెందిన మేకల నాగయ్య, హైదరాబాద్ కొత్తపేటకు చెందిన ఐత కృష్ణ, అలాగే లొట్లబండ తండాలో ఓ ఆటోలో 16 క్వింటాలు రేషన్ బియ్యం పట్టుపడ్డాయి. తనిఖీ చేయగా సిద్దిపేట జిల్లా జైదాపూర్ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన గుగులోతు రాజు, పెద్దవంగర (ఇదే మండలం) బావోజీ తండాకు చెందిన ఆటో డ్రైవర్ ధారావత్ కోప్లి అను వ్యక్తులు అక్రమంగా తరలిస్తుండగా పట్టుపడ్డారు. ఆ రెండు వాహనాల్లో మొత్తం 136 క్వింటాల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనాలను సీజ్ చేసి సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# ఘనంగా బొమ్మెర ఉపేందర్- లలిత దంపతుల పెళ్లి రోజు వేడుకలు

పెద్ద వంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి సైదులు మార్చి 9



'ఏళ్ళన్నీ గడచినా చెదరని మీ అనుబంధం%శొ% ఇలాగే కలకాలం సాగాలని ఆశిస్తూ.. ఉపేందర్ లలిత దంపతులకు హృదయపూర్వక పెళ్ళిరోజు శుభాకాంక్షలు' పలువురు స్నేహితులు, బంధువులు, శ్రేయోభిలాషులు, ప్రముఖులు తెలిపారు. 2000 మార్చ్ 8న వీరి వివాహం జరిగింది. నేటితో 25 వసంతాలు పూర్తి చేసుకున్నారు. ఇదే రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం కావడంతో ఈ సందర్భంగా మండలంలోని చిన్న వంగర గ్రామంలో శనివారం పెళ్లి రోజు వేడుకలు కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఉపేందర్ %-% లలిత దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంధువులు రంగు అంబిక -లక్ష్మీనర్సు దంపతులు, కుమారులు బొమ్మెర సాయి తేజ, సాయి పవన్, సిద్ధిక్, కుటుంబ సభ్యులు కవిత, అబ్బ సాయిలు, రాజేశ్వరి, పరశు రాములు, అశోకు, సరిత, నరేష్, వెంకన్న, రాధిక, స్నేహితులు వేణు రమేష్ రాహుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

## చదువులు నేర్పిన గురువులకు సన్మానం

ఫోకస్ న్యూస్( సదాశివపేట) మార్చి9 సదాశివపేట



పట్టణంలోని ఎంజి ఫంక్షన్ హాల్ లో ఆదివారం నాడు ఉన్నత పాఠశాల1991.92 సంవత్సరానికి చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి చదువులు నేర్పిన గురువులను ఆహ్వానించి వారిని శాలువా పూలదండలతో సన్మానించారు.వారిఆశీస్సులను పొందినారు. ఈ కార్యక్రమంలో పూజ్య గురువులు శ్రీశైలం సార్. ప్రభాకర్ సార్. అశోక్ సార్. పండరి సార్. రుక్మ రెడ్డి సార్. శ్రీనివాస్ రెడ్డి సార్. రవీంద్రనాథ్ సార్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ. 30 సంవత్సరాల క్రితం చదువు నేర్పిన గురువులను ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ద్వారా గురువలను సన్మానించడం సంతోషకరమన్నారు. కరమన్నారు ఇదే మాకిచ్చే గురుదక్షిణ అని విద్యార్థులందరినీ ఆశీర్వదించారు. మీరు మీ కుటుంబ సభ్యులు ఆయువు ఆరోగ్యలతో ఉండి దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులందరూ ఒకరినొకరు ఆ లింగనం చేసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో100 పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



## ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా

ఫోకస్ న్యూస్ ( సదాశివపేట) మార్చి 9

సదాశివపేట సొసైటీ-1 అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా వందమంది ముస్లిం సోదరులకు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నరసింహ గౌడ్ దంపతులు) గత నాలుగు సంవత్సరాలుగా రంజాన్ తోఫా అందజేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా శ్రీనివాస్గౌడ్ మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా ప్రతి సంవత్సరం ముస్లింలకు పవిత్ర మాసమైనటువంటి రంజాన్ మాసంలో రంజాన్ తోఫాలో ఈ సరుకులు ఇవ్వడం జరుగుతుందన్నారు. బియ్యం 25 కేజీలు, గోధుమపిండి 5 కిలోలు, చక్కెర 5 కిలోలు, మంచి నూనె ఐదు కిలోలు, శనగపప్పు రెండు కిలోలు, కందిపప్పు రెండు కిలోలు. ముస్లింలకు రంజాన్ కిట్టు ఇవ్వడంలో తనకు చాలా తృప్తిని ఇస్తుందన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ 27 భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలి : మాజీ మంత్రి ఎర్రబెల్లి

నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి సైదులు మార్చి 9

పాలకుర్తి మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్ హాల్లో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించగా రాష్ట్ర మాజీ మంత్రి,పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు ఈ సమావేశంలో దయాకర్ రావు మాట్లాడుతు ఏప్రిల్ 27 తేదీన జరిగే బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ భారీ బహిరంగ సభను బిఆర్ఎస్ నాయకులు ,కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో నియోజకవర్గ స్థాయి పార్టీ ముఖ్య నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

అచ్చంపేట నియోజకవర్గం నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఆర్ భరత్ మర్చి 09



నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేసినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికీ అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రత్యేకతలు తెలియజేయడం జరిగినది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గం నల్లమల్ల అటవీ ప్రాంతంలో ఉండే నీరు పేద విద్యార్థుల కోసం అదేవిధంగా ఇక్కడ అత్యధికంగా ఉండే ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ ఓ బి సి విద్యార్థులు ఉంటారని గమనించిన మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి విడత లోనే ఈ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు చేయడం జరిగిందని తెలియజేశారు ఎంగేటియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి 200 కోట్లు మంజూరు కూడా చేయడం జరిగిందని ఏ మంజూరు చేసిన త్వరలోనే నిర్మాణాలు చేపడతామని తెలియజేశారు.

## గిరిజన విద్యార్థులకు మార్చి 11న జిల్లా స్థాయి వాటర్ స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్

అచ్చంపేట నియోజకవర్గం నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఆర్ భరత్ మార్చి 9



గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటర్ స్పోర్ట్స్ స్కూల్ నాగర్ కర్నూలు జిల్లా స్థాయి సెలక్షన్ 11 మార్చి 2025 రోజున గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ బాలుర పాఠశాల,బాణాల గ్రామము బల్మూరు మండల్ నాగర్ కర్నూల్ జిల్లా యందు నిర్వహించడం జరుగుతుందని నాగర్ కర్నూలు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎం ఫిరంగి ప్రకటన ద్వారా తెలియజేయడం జరిగినది. ఈ వాటర్ స్పోర్ట్స్ స్కూల్ కు నాగర్ కర్నూలు జిల్లాలో 2024 25 సంవత్సరంలో ప్రస్తుతం 4 వ తరగతి చదువుతున్నటువంటి ప్రతి గిరిజన బాలురు బాలికలు ఒకటి ఆగస్టు 2016 లోపు జన్మించిన విద్యార్థిని విద్యార్థులు పరులు ఏ వాటర్ స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్ కు వెళ్లి విద్యార్థులు కావలసిన ధ్రువీకరణ విద్యార్థి యొక్క పాఠశాల నుంచి పొందిన బోనాఫైడ్ సర్టిఫికెట్ తో పాటు రెండు పాస్ ఫోటోసు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రము, ఆదాయ ధ్రువీకరణ పత్రము తీసుకొని 11 మార్చి 2025 రోజున ఉదయం 8 గంటల లోపు హాజరు కావలసిందిగా తెలియజేయడం జరిగినది. అదేవిధంగా ఏ సెలక్షన్ కు హాజరయ్యే విద్యార్థులు నాగర్ కర్నూలు జిల్లా ఏసీఎంఓ డి తిరుపతయ్య 79815 25389, నాగర్ కర్నూలు జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ బిలావత్ భీమ్లా నాయక్ 9010615106 సంప్రదించవలసిన

## పెద్దమందడి ప్రెస్ క్లబ్ ఏకగ్రీవం

### -అధ్యక్ష కార్యదర్శులుగా ఈశ్వర్, చంద్రశేఖర్ రెడ్డి

పెద్దమందడి నేటి ఫోకస్ న్యూస్:



పెద్దమందడి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షులుగా నేతృత్వం వహించిన సీనియర్ జర్నలిస్ట్ సూరంపల్లి గోపాల్ చారి అధ్యక్షతన ఆదివారం మండల కేంద్రంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అధ్యక్ష కార్యదర్శులుగా ఎం. ఈశ్వర్ (వి6 వెలుగు) విట్ట చంద్రశేఖరరెడ్డి (నమస్తే తెలంగాణ) లను ఎన్నుకున్నారు. అలాగే గౌరవ సలహాదారుగా వెంకట్ గౌడ్, శ్రీనివాస యాదవ్, ఉపాధ్యక్షులుగా బండి రాజు, కార్యదర్శిగా శివకుమార్ ఆచారి, కోశాధికారిగా ప్రవీణ్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సురేందర్ గౌడ్ వెంకటేష్ గౌడ్ రామ్ నరేష్ బాజా శేఖర్ గడ్డమీది రాజు అశోక్ అశోక్ మన్యం కృష్ణ మహేష్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులకు గౌరవ అధ్యక్షులు గోపాల్ చారి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. అనంతరం అధ్యక్షులు ఈశ్వర్ మాట్లాడుతూ జర్నలిస్టుల భద్రతకు భరోసాగా తన సొంత డబ్బులతో ప్రీమియం చెల్లిస్తానని హామీ ఇచ్చారు.

## దళిత సంఘాల జేఏసీ కన్వీనర్ కరాటే శ్రీరామ్ ని సన్మానించిన... కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్

నేటి ఫోకస్ న్యూస్, నాచారం:



దళిత జాతి ఆణిముత్యం, దళిత జాతి ముద్దుబిడ్డ, దళితుల ఆశాజ్యోతి, నాచారం డివిజన్ దళిత సంఘాల కన్వీనర్ గా నూతనంగా ఎన్నికైన కరాటే శ్రీరామ్ ను నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్ శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, దళిత సంఘాల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులరా ఎర్రబెల్లి జోలికి వస్తే ఊరుకోం

### : బీఆర్ఎస్ పాలకుర్తి నాయకులు

పాలకుర్తి మార్చి9 నేటి ఫోకస్ న్యూస్:

పాలకుర్తి నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, నేడు పాలకుర్తి మండల కేంద్రములోని శ్రీసోమేశ్వర ఫంక్షన్ హాల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖబర్దార్ కాంగ్రెస్ నాయకుల్లారా పాలకుర్తి నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీని విమర్శించే అర్హత గాని, స్థాయి గాని కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదని, నియోజక వర్గం మొత్తం ఎర్రబెల్లి దయాకర్ రావు చేతనే అభివృద్ధి జరిగింది అని వాళ్లు మాట్లాడారు. నియోజకవర్గంలో ఎంఎల్ఏ గాని కాంగ్రెస్ పార్టీ నాయకులు గాని చేసింది ఏమి లేదని కేవలం రోడ్డు మీద షోలు చేయటం తప్ప అని బిఆర్ఎస్ నాయకులు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకురాలా మీరు నిజంగా కాంగ్రెస్ నాయకులు అయితే ఎన్నికల ముందు మీరిచ్చిన హామీలను నెరవేర్చాలని, ఎర్రబెల్లి జోలికొస్తే ఊరుకోం తొక్కి నార తీస్తాం అని వాళ్లు ఈ సమావేశంలో హెచ్చరించారు.